

ఉప్పరిగూడ పీఏసీఎస్ పనితీరు భేష్

నాబార్డు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అజయ్ కుమార్



మాట్లాడుతున్న అజయ్ కుమార్

ఆదిభట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉప్పరిగూడ సహకార సంఘం పనితీరు భేష్‌గా ఉందని నాబార్డు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉప్పరిగూడ పీఏసీఎస్‌ను నాబార్డు బృందం ఆకస్మిక తనిఖీ చేశారు. సహకార సంఘంలో పనితీరును అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్‌లో రైతులకు, వినియోగదారులకు అందిస్తున్న సేవలు, కంప్యూటరైజేషన్ పనితీరును పరిశీలించారు. నాబార్డు నుంచి వచ్చిన నిధులపై ఆరా తీశారు. పీఏసీఎస్‌ను వాణిజ్య బ్యాంకులకు దీటుగా తీర్చిదిద్దడం బాగుందని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, సభ్యులు, సీఈవో పనితీరు బాగుందని కితాబిచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సంఘాన్ని తీర్చిదిద్దడం, బ్యాంకు లావాదేవీలు కంప్యూటరైజేషన్ చేయడం బాగుందన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడం అభినందనీయమన్నారు. నాబార్డు నుంచి వచ్చిన నిధులను సంఘం అభివృద్ధి కోసం అవకతవకలు లేకుండా వినియోగించాలన్నారు. రైతులకు పంట రుణాలు అందించి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న పీఏసీఎస్‌లకు ఉప్పరిగూడ సహకార సంఘం మోడల్‌గా నిలుస్తుందన్నారు. నాబార్డు సీజీయం వైకే రావు, టెస్కాబ్ జీఎం ప్రభాకర్ రెడ్డి, డీజీఎం కిరణ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, సీఈవో గణేష్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో కీలక ఘట్టమైన మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. నామినేషన్ల స్ర్కూటినీ కూడా పూర్తవగా... షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని 153 గ్రామపంచాయతీలకు గాను 770 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. గతంలో ఎన్నడూ ఊహించని విధంగా నామినేషన్లు దాఖలు కావడంతో ఆయా పార్టీల అగ్రనేతలు అయోమయానికి గురవుతున్నారు. ఇంతమంది అభ్యర్థులు పోటీచేస్తే ఎవరికి గెలిచే అవకాశం ఉండదన్న గుబులు ప్రధాన పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో నెలకొంది. దీంతో ఆయా పార్టీల అగ్రనేతలు రంగంలోకి దిగారు. ఒకేపార్టీ నుంచి ఒకరికి మించి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులను పోటీ నుంచి తప్పుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

మొదటి విడత నామినేషన్లు

మండలం	పంచాయతీలు	అభ్యర్థులు
ఫరూఖ్‌నగర్	47	222
కొత్తూరు	12	54
నందిగామ	19	96
కేశంపేట	29	142
కొందుర్గు	29	142
చౌదరిగూడ	24	120



బుంగమూతులు.. బుజ్జగింపులు!

నామినేషన్లు ఉపసంహరించుకునేలా ప్రయత్నాలు

ఒకేపార్టీ నుంచి ముగ్గురు నలుగురు బరిలో..
రంగంలోకి దిగిన ఆయా పార్టీల అగ్రనేతలు
స్వతంత్ర, రెబల్ అభ్యర్థులతో బేరసారాలు
భారీగా ముట్టజెప్పేందుకు సిద్ధంగా అభ్యర్థులు
షాద్‌నగర్ నియోజకవర్గంలో 153 పంచాయతీలు.. 770 నామినేషన్లు

షాద్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రథమ పౌరుడు అనిపించుకోవాలని రాజకీయ ఆసక్తి ఉన్న చాలామందికి ఉంటుంది. ఒక్కసారైన సర్పంచ్ పదవిని పొందాలని గ్రామీణ నాయకుల్లో ప్రతీ ఒక్కరికి ఉంటుంది. కానీ సమయం, సందర్భం వచ్చేసరికి ఎన్నో అడ్డంకులు.. మరెన్నో ఒత్తిడిలు.. రిజర్వేషన్ల కారణంగా చాలామంది ఆశావహులు అవకాశం కోల్పోగా... వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని రంగంలోకి దిగిన వారు ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇందుకు కారణం ఒకే పార్టీ నుంచి ముగ్గురు నలుగురు పోటీలో ఉండటమే. ఒక్కరిని బరిలో ఉంచి మిగతా వారిని పోటీ నుంచి విరమింపజేసే కార్యక్రమం ఒకవైపు.. ఓటు బ్యాంకు ఉండి స్వతంత్రంగా రంగంలోకి దిగిన వారిని పోటీ చేయకుండా అడ్డుకోవడం మరోవైపు ఒత్తిడిలు కొనసాగుతున్నాయి. దీనిపై దృష్టి కేంద్రీకరించిన ఆయా రాజకీయ పార్టీల అగ్రనేతలు రంగంలోకి దిగారు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఆరుమండలాల్లో 153 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటికి ఎన్నికలు

మిగతా 8వ పేజీలో...

ఎంతోకొంత ఇస్తే తప్పుకుంటాం

కొంతమంది అభ్యర్థులు మాత్రం తమకు ఎంతో కొంత ముట్టచెబితే తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటామంటూ ప్రధాన పార్టీల అభ్యర్థులను వేడుకుంటున్నారు. కేవలం డబ్బుల కోసమే నామినేషన్లు వేశారని, వారికి గ్రామంలో ఎలాంటి పట్టు లేదని ప్రధాన పార్టీల అభ్యర్థులు పార్టీ అగ్రనేతల దృష్టికి తీసుకువెళ్తున్నారు. వారి నామినేషన్ దాఖలుకు అయిన ఖర్చుతో పాటు ఎంతో కొంత అదనంగా వారికి ముట్టచెబితే 90 శాతం మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటారన్న ఆలోచనలో ఉన్నారు. అలాంటి వారిని ముందుగా పిలిపించి వారి నామినేషన్లను ఉపసంహరించుకునేలా చేస్తున్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా పంచాయతీ ఎన్నికలు

» కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులతో కమిటీలు ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని ఆయా జిల్లా కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించామని, పరిశీలన కూడా పూర్తయ్యిందన్నారు. వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణకు రాండమైజేషన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని, అవసరమైన బ్యాలెట్ బాక్సులను కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కూడా సమకూర్చుతున్నట్లు ఆయన చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్‌శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత ఎన్నికల సిబ్బంది, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, సీపీవో సౌమ్య, జిల్లా ఆడిట్ అధికారి వెంకట్‌రెడ్డి, పౌర సరఫరాల డీఎం హరీష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కడ్తాల్ : రావిచెడ్ సర్పంచ్ పదవికి నామినేషన్ వేస్తున్న బొప్పిడి గోపాల్

రెండోరోజూ నామినేషన్ల జోరు

» చేవెళ్ల, ఆమనగల్ డివిజన్‌లో కొనసాగుతున్న ప్రక్రియ
» 178 సర్పంచ్ స్థానాలకు 407.. 1540 వార్డు స్థానాలకు 1,775 దాఖలు

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/చేవెళ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో సోమవారం రెండోరోజు నామినేషన్ల ప్రక్రియ చేవెళ్ల డివిజన్, కందుకూరు డివిజన్ల పరిధిలో ప్రశాంతంగా జరిగింది. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్,

మిగతా 8వ పేజీలో...

రెండో విడత తొలిరోజు నామినేషన్ల వివరాలు

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
చేవెళ్ల	25	58	218	294
షాబాద్	41	107	352	364
శంకర్‌పల్లి	24	53	210	273
మొయినాబాద్	19	32	166	209
ఆమనగల్లు	13	26	112	91
కడ్తాల్	24	54	272	258
తలకొండపల్లి	32	77	210	286

గ్లోబల్ సమ్మిట్ పనులు సమన్వయంతో పూర్తిచేయాలి



అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి
మల్టీజోన్ డీజీ డీఎస్ చౌహాన్
ఫ్యూచర్ సిటీ అథారిటీ కమిషనర్ ఎండీ శశాంక, అధికారులతో సమీక్ష

సమావేశంలో శశాంక, సుధీర్ బాబులతో కలిసి మాట్లాడుతున్న చౌహాన్



దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు ఏర్పాటు చేసిన వసతులు

కందుకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 8, 9వ తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పనులను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలని మల్టీజోన్ డీజీ డీఎస్ చౌహాన్ సూచించారు. సోమవారం ఫ్యూచర్‌సిటీ అథారిటీ ఎండీ శశాంక, రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబులతో కలిసి అన్ని విభాగాల హెచ్‌ఓడీలతో కందుకూరు మండలం మీర్కాన్‌పేటలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ.. 100 ఎకరాలలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే అతిథులకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ సౌకర్యంలో

మిగతా 8వ పేజీలో...

అబుదాబి వెళ్లే ప్రయాణికుడికి అస్వస్థత

శంషాబాద్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఈవై - 353 ఇతియాద్ ఎయిర్‌లైన్ విమానంలో అబుదాబి వెళ్లేందుకు ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. సోమవారం అర్ధరాత్రి 2.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి అబుదాబికి వెళ్లేందుకు ఎయిర్‌పోర్టు వచ్చిన లక్కంశెట్టి శశి(36) అనే ప్రయాణికుడు విమానంలో ఎక్కిన తరువాత తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో ఎయిర్‌లైన్స్ అధికారులు ఎయిర్‌పోర్టు మెడికల్ సిబ్బంది సమాచారం అందించారు. వెంటనే విమానం దగ్గరికి వచ్చిన ఏఎంపీ సిబ్బంది ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అయితే అతన్ని పరిశీలించిన డాక్టర్లు విమానంలో ప్రయాణించడం మంచిది కాదని సూచించారు. అయితే డాక్టర్ల సలహా మేరకు ఎయిర్‌పోర్టులోనే దిగిపోయాడు. అనంతరం విమానం తెల్లవారుజామున 4.15 గంటలకు అబుదాబి బయలుదేరి వెళ్లింది.

విమానంలో సాంకేతిక సమస్య

శంషాబాద్ రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి జైపూర్ వెళ్లాల్సిన విమానం సాంకేతిక లోపంతో ఆలస్యమైంది. ఆదివారం రాత్రి 9.55 గంటలకు 124 మంది ప్రయాణికులతో బయల్దేరడానికి సిద్ధంగా ఉంది. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో విమానాన్ని నిలిపివేశారు. తరువాత ప్రయాణికులను దింపి గేటు 101 నుంచి విమానాశ్రయంలోకి తీసుకెళ్లారు. అయితే ఈ సందర్భంగా ప్రయాణికులకు, ఎయిర్‌లైన్స్ అధికారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విమానంలో ప్రయాణికులను కూర్చోబెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి వాతావరణం అనుకూలించడంతో సోమవారం 12.15 గంటలకు బయల్దేరి వెళ్లింది. కొందరు ప్రయాణికులు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. మిగిలిన ప్రయాణికులతో జైపూర్ వెళ్లిందని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించారు.

ప్రేమ జంట ఆత్మహత్య

మృతులు బిహార్ రాష్ట్ర వాసులు
ఒకే పరిశ్రమలో కార్మికులు
సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ



ధనుంజయ (ఫైల్)



అనామిక(ఫైల్)

కొత్తూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రం నుంచి షాద్‌నగర్ నియోజవర్గం కొత్తూర్‌కు వలస వచ్చారు. ఒకే పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఇద్దరు ప్రేమించుకున్నారు. చివరకు ఏమైందో ఏమో తెలియదు కానీ ఇరువురు ఫ్యాన్‌కు ఉరేసుకుని తనవు చాలించుకున్న సంఘటన పలువురిని కలిచివేసింది. కూతురు ఆత్మహత్య చేసుకోవడంతో తండ్రి, చెల్లెలు కన్నీరుమున్నీరుగా విలపించిన హృదయ విషాదకరమైన సంఘటన ఇది. స్థానిక ఇన్‌స్పెక్టర్ జి.నర్సయ్య, స్థానికుల కథనం ప్రకారం. బిహార్ రాష్ట్రానికి చెందిన నవనీత్‌కుమార్ రోషన్ మూడేళ్ల క్రితం తన ఇద్దరు కూతుళ్లతో కలిసి కొత్తూర్‌కు వలస వచ్చాడు. నవనీత్‌కుమార్ ఐటీసీఎల్ పరిశ్రమలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, పెద్ద కూతురు అనామిక (22)తో పాటు చిన్న కూతురు రవిఫుడ్స్ పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. తల్లివారి స్వగ్రామంలో ఉంటుంది. తండ్రి, కూతుళ్లు కలిసి రైల్వే స్టేషన్ రోడ్డులో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. బిహార్ రాష్ట్రానికి చెందిన ధనుంజయ(25) కూడా కొత్తూర్‌కు వలస వచ్చి ఇదే పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ కొత్తూర్‌లో స్నేహితులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అనామిక, ధనుంజయ్యలు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. బిహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికలకు ధనుంజయ్య అక్కడికి వెళ్లి ఓటు వేసి ఇటీవల వచ్చాడు. గత మూడు రోజులుగా అనామిక విధులకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటుంది. దాంతో ధనుంజయ సోమవారం అనామిక ఇంటికి వెళ్లగా అప్పటికే యువతి ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. అనామికను కిందకు దింపి చూసేసరికి మృతి చెంది ఉంది. ఇది చూసి తట్టుకోలేని ధనుంజయ అనామికకు చెందిన చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనామిక తండ్రి నవనీత్‌కుమార్ భోజనం చేసేందుకు ఇంటికి రాగా తలుపులు పెట్టి ఉన్నాయి. పిలిచినా ఇంట్లో ఎవరు పలకకపోవడంతో కిటికీ లోపలి నుంచి చేయి పెట్టి తలుపు తీసి లోపలికి వెళ్లగా, ఇరువురు మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. బోరున విలపిస్తూ చుట్టుపక్కల వారికి విషయాన్ని తెలిపాడు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఫ్యాన్‌కు వేలాడుతున్న ధనుంజయ్యను కిందకు దింపారు. సంఘటన స్థలాన్ని శంషాబాద్ జోన్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, క్లూస్‌టీం పరిశీలించి పలు ఆధారాలు సేకరించారు. మృతదేహాలను శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు తండ్రి నవనీత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సయ్య పేర్కొన్నారు.

ఫాంహౌజ్‌లో కాలిపోయిన 70 క్వింటాళ్ల పత్తి

» రైతుకు రూ.1.60 లక్షల నష్టం
» జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఘటన



పెద్ద ఎల్కిచర్లలో కాలిన పత్తిని చూపిస్తున్న రైతు

చౌదరిగూడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫాంహౌజ్‌లో నిల్వ ఉంచిన పత్తి కాలిపోయిన ఘటన రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని పెద్దఎల్కిచర్ల గ్రామానికి చెందిన రైతు జనార్దన్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన బుగ్గేశ్వర్ వద్ద 12 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేశాడు. పంటను తీసి పక్క పొలంలో ఉన్న అబ్జిషెట్ వాళ్ల ఫాంహౌజ్‌లో 70క్వింటాళ్ల పత్తిని నిల్వ చేసి ఉంచాడు. సీసీఐకి విక్రయించేందుకు స్లాట్‌బుక్ చేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం దాదాపు ఏడు గంటలకు ఫాంహౌజ్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం 6గంటల సమయంలో ఫాంహౌజ్‌కు వెళ్లేసరికి పొగలు రావడం గమనించాడు. వెంటనే కుమారునికి, చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చి మోటర్ల సహాయంతో పొగను ఆర్పివేసినట్లు బాధిత రైతు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పత్తి నిల్వ ఉన్న ఫాంహౌజ్‌లోని రూం కిటికీ తెరిచి ఉండటం, పత్తికి ఆనుకొని విద్యుత్ కనెక్షన్ ఉండటం వల్లే ప్రమాదం సంభవించిందా..? లేదంటే ఎవరైనా నిప్పు అంటించారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బాధిత రైతు జనార్ధన్ రెడ్డి ఎవరిపైన అనుమానం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

» డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి
» షాద్‌నగర్‌లో వైద్య సిబ్బంది ర్యాలీ

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి కోరారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినంను పురస్కరించుకొని సోమవారం షాద్‌నగర్ పట్టణంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి చౌరస్తా వద్దకు చేరుకొని మానవ హారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ యుక్త వయస్సు ఉన్నవారందరూ సురక్షితమైన లైంగిక చర్యలను పాటించాలని సూచించారు. ఎయిడ్స్‌పై అవగాహనను పెంచుకోవాలని కోరారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వ్యక్తిలో క్రమంగా రోగ నిరోధక శక్తి తగ్గి మరణానికి దారితీస్తుందని హెచ్చరించారు. వ్యాధి సోకినవారు వైద్య సేవలు పొంది జీవితకాలాన్ని పెంచుకోవాలని కోరారు. ర్యాలీలో వైద్యాధికారులు డాక్టర్ జగదీష్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ ఉష, డాక్టర్ బిందు, డాక్టర్ శ్వేత, డాక్టర్ ప్రవీణ, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ చౌరస్తాలో మానవహారాన్ని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జర్నలిస్టుల మహాధర్నాను విజయవంతం చేయాలి


మేడ్చల్ కలెక్టరేట్ వద్ద మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరణ చేస్తున్న జర్నలిస్టులు

మేడ్చల్/షాబాద్/చేవెళ్ల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ టీయూడబ్ల్యుజే-ఐజేయూ ఆధ్వర్యం లో డిసెంబరు 3న రాష్ట్ర సమాచార శాఖ ఐజే యూ కమిషనర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న జర్నలిస్టుల మహాధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బాలరాజ్, వెంకట్రాంరెడ్డిలు పిలుపునిచ్చారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద మహాధర్నాకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు అమలైన సంక్షేమ పథకాలను సైతం తెలంగాణ రాష్ట్రం వచ్చాక అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి వెంకట్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు నాగేంద్రచారి, వివిధ పత్రికల జిల్లా స్టాఫ్‌రిపోర్టర్లు కృష్ణ, రవి, రామారావు, శ్రీనివాస్, రవికిరణ్‌రెడ్డి, రామకృష్ణ, యాదగిరి, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింగ్‌రావు, గిరిబాబు, రవి, శ్రీధర్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. జర్నలిస్టుల మహాధర్నాను విజయవం తం చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు సలీం పాషా, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. షాబాద్‌లో సంఘం నాయకులతో కలిసి మహాధర్నా పోస్టర్ను ఆవిష్కరించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో నడుస్తోందన్నారు. జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు జర్నలిస్టులందరూ ధర్నాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టులు రాంచంద్రయ్య, రమేష్, రవీందర్‌గౌడ్, గోపాల్, శ్రీనివాస్‌గుప్తా, మల్లికార్జున్, వెంకటేశ్, కరుణాకర్‌చారి, రాఘవేందర్ గుప్తా, లక్ష్మణ్, శ్రవణ్ పాల్గొన్నారు. చేవెళ్లలో డిసెంబరు 3న జరిగే మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణలో సంవత్సరాలుగా అత్యంత నిరాదరణకు గురైన వర్గం జర్నలిస్టులే అని చెప్పారు. ఉద్యమంలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టుల జీవితాలు మెరుగుపడలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అందిన ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు సైతం అందడం లేదని వాపోయారు. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద 3న ఉదయం 10గంటలకు మహాధర్నా ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఆనంద్, గోపాల్, రాకేశ్, మధు, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్, దయాకర్, ఆనంద్, రాజు, ప్రసాద్, యాసిన్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.


షాబాద్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

పంతూ నాయక్ సేవలు చిరస్మరణీయం


పంతూనాయక్ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాయకులు

కడ్తాల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంతూ నాయక్ గొప్ప ఆశయ సాధకుడని, ఆయన సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మనుషులు జీవితకాలంలో చేసిన మంచి పనులు మరణానంతరం కూడా కీర్తించబడుతాయని, అందుకు దివంగత ఆమనగల్లు మాజీ ఎంపీపీ రామావత్ పంతూనాయక్ నిదర్శనమని అన్నారు. ప్రతి మనిషి ఉన్నంతలో పరులకు సాయమందించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీ, మైసిగండి మైసమ్మ ఆలయ వ్యవస్థాపకులు పంతూనాయక్ 18వ వర్ధంతిని మైసిగండిలో సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పంతూనాయక్ విగ్రహానికి, ఘాట్ వద్ద అభిమానులు, ప్రజాప్రతినిధులు,పంతూనాయక్ సతీమణి సిరోలితో కలిసి పూలమాలలు వేశారు. పంతూనాయక్ ఆశయ సాధనకు మైసిగండి గిరిజనులంతా ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్పీ జ్యోతిఅరుణ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కనుమరుగు

స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు కాక తప్పదని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కడ్తాలకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మూడ రవి ఆధ్వర్యంలో కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ.. ప్రగతి నిరోధకులకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, వెంకటేష్, లక్ష్మయ్య, చందోజీ, రాం చందర్ పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో సత్యం, మహేశ్, ప్రశాంత్, రవి ఉన్నారు.

గ్యారెంటీల అమల్లో ప్రభుత్వం విఫలం


ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కందుకూరు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల అమల్లో విఫలమైందని మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితారెడ్డి అన్నారు. సోమవారం ఆకులమైలారం మాజీ ఉపసర్పంచ్ రాంరెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు నగరంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి బీఆర్ఎస్‌లో జాయిన్ అయ్యారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, సురేందర్, పాండు, తిరపతయ్య, వెంకటాచారి పాల్గొన్నారు.

రోడ్డు పనులను అడ్డుకున్న రైతులు


కుర్మిద్ద తండా వద్ద రోడ్డు పనులకు వచ్చిన ఎల్‌అండ్‌టీ కార్మికులు

యాచారం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మిద్ద తండా వద్ద రోడ్డు పనులు చేసేందుకు మిషన్లతో వచ్చిన ఎల్‌అండ్‌టీ కంపెనీ కార్మికులను రైతులు అడ్డుకున్నారు. 'మా భూమి తీసుకొని పూర్తిగా పరిహారం ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వకుండా మా భూమిలో రోడ్డు పనులు చేయొద్దు.' అని రైతులు పనులను అడ్డుకున్నారు. కార్మికులు రైతుల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. రైతులు పనులను అడ్డుకున్నారనపి కార్మికులు కంపెనీ సూపర్‌వైజర్లకు సమాచారమిచ్చారు. తాము రోడ్డు పనులను అడ్డుకున్నామని రైతులు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి తెలిపారు. మంగళవారం ఎల్‌అండ్‌టీ కంపెనీ అధికారులు, టీజీఐఐసీ., రెవెన్యూ అధికారులు రోడ్డు పనులు చేసే ప్రదేశానికి వచ్చి రైతులతో మాట్లాడతారని తెలుస్తోంది.

మాల్‌లో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు

● తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించిన పోలీసులు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

యాచారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్‌లో నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై యాచారం పోలీసులు చెక్‌పోస్టు వద్ద సోమవారం నుంచి యాచారం సీఐ ఏ.నంధీశ్వర్‌రెడ్డి, ఎస్సై మధులు వాహనాలను తనిఖీ చేశారు. వచ్చీపోయే వాహనాలను తనిఖీ చేసింతర్వాతే వదిలేస్తున్నారు. మధ్యాహ్నం నుంచి డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. డ్రైవింగ్ పత్రాలు, ఆర్సీలు లేని వాహనాలకు జరిమానా విధిస్తున్నారు. వాహనాదారులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని పోలీసులు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఇకపై 24గంటల పాటు ఈ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తామని పోలీసులు తెలిపారు.

ఘనంగా గీతాపారాయణం


చేవెళ్ల హనుమాన్ ఆలయంలో గీతా పారాయణం చేస్తున్న భక్తులు

చేవెళ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలోని హనుమాన్ ఆలయంలో గీతపారాయణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. భగవద్గీత జయంతి, గీతాయజ్ఞాన్ని పురస్కరించుకొని పట్టణంలోని హనుమాన్ ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు హోమాలు నిర్వహించారు. దంపతులు, మహిళలు గీతా పారాయణం చేశారు. ప్రతీ ఒక్కరు దైవచింతన కల్గి ఉండాలని నిర్వాహకులు సూచించారు. గీతాపారాయణంతోనే మనస్సు ప్రశాతంగా ఉంటుందన్నారు.

ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ➤



వికారాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజాఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన 16 ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన పెన్షన్, వ్యవసాయం, భూసమస్యలపై ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో మంగ్లీలాల్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ-రీసెట్ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌తో విజ్ఞాన్ మహిళా కళాశాల ఎంవోయూ


ఒప్పందాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఘట్‌కేసర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ-రీసెట్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ అండ్ ఇంజినీరింగ్, టెలీ కమ్యూనికేషన్స్ సికింద్రాబాద్ వారితో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి కొండాపూర్‌లో గల విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం యాజమాన్యం వివిధ అంశాలపై పలు కీలక ఒప్పందాలు చేసుకున్నట్లు కళాశాల యాజమాన్యం సోమవారం తెలియజేశారు. వివిధ అంశాలపై ఇలాంటి కీలక ఒప్పందాలు చేసుకోవడంలో విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ రాష్ట్రంలోనే మొదటిదని తెలిపారు. ఈ ఎంవోయూతో విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని మరింత మెరుగుపర్చుకునే వీలుంటుందని చెప్పారు. ప్రధానంగా వివిధ ప్రాజెక్టులపై శిక్షణ, వర్క్‌షాప్‌లు, సెమినార్లతో పాటు ప్లేస్మెంట్స్ పొందేం దుకు దోహదపడుతుందని తెలిపారు. ఇందుకు శ్రమించిన కళాశాల సీఈవో శ్రావణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పారావు నాయుడు, ప్రొఫెసర్లు పులయ్య, పద్మలీల, మస్తాన్, శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఏవైనా గెలుపు బీజేపీదే...


బీజేపీలో చేరిన వారితో మాట్లాడుతున్న అందెల శ్రీరాములుయాదవ్

మహేశ్వరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా పరిషత్‌తో పాటు మెజారిటీ ఎంపీపీ, సర్పంచ్‌ల స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని, ఎన్నికలు ఏవైనా మహేశ్వరంలో కమలం జెండా ఎగరడం ఖాయం అని జిల్లా బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. బీజేపీ మహేశ్వరం మండలాధ్యక్షుడు యాదీష్ ఆధ్వర్యంలో సోమవారం మొహబ్బత్‌నగర్‌లో పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 420హామీల అమలులో విఫలమైందన్నారు. బీసీ, ప్రజావ్యతిరేకతను అధిగమించాలనే కుట్రతోనే బీసీ రిజర్వేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. ఎన్నికల్లో విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, రామ్‌రెడ్డి, కృష్ణ, శేఖర్, దేవేందర్, ఆంజనేయులు, నరేందర్, భాస్కర్, విజయ్, రవి, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలని ధర్నా


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు

కందుకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తమకు డబుల్ బెడ్ రూములను వెంటనే కేటాయించాలంటూ సరూర్‌నగర్ మండలానికి చెందిన లబ్ధిదారులు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడారు. గత ప్రభుత్వం తమకు ఇళ్లను మంజూరు చేసి మంఖాల్-1(సర్దార్‌నగర్)లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. 702 మంది వాటిల్లో నివాసాలు ఉంటుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అందులో 640 మందికి మాత్రమే డబుల్ బెడ్‌రూముల పట్టాలు ఇచ్చి, 162 మంది లబ్ధిదారులకు తిరిగి పట్టాలు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వారితో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. లబ్ధిదారుల సమస్యను కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

రెడీమిక్స్ ట్రక్కు బోల్తా



శంకర్‌పల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎల్వర్తి మూల మలుపు వద్ద సిమెంటు రెడీ మిక్స్ వాహనం బోల్తా పడింది. శంకర్‌పల్లి వైపు నుంచి చేవెళ్ల వెళ్తున్న సీసీ మిక్సర్ సోమవారం తెల్లవారు జామున ఎల్వర్తి మూల మలుపు వద్ద బోల్తా పడింది. డ్రైవర్ చోటన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశారు.

అభివృద్ధి పేరిట ఏకగ్రీవాల వైపు ..



బొంరాస్‌పేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని 35 పంచాయతీల్లో ఆరు ఏకగ్రీవమయ్యాయి. సాలిండాపూర్‌లో రిక్కిబాయి, మదన్‌పల్లి తండాలో శంకర్‌నాయక్, జానకంపల్లిలో వెంకటయ్య, నాగిరెడ్డిపల్లిలో అనిత నర్సిములు, కట్టుకాల్వ తండాలో కిషన్‌నాయక్, టేకులగడ్డ తండాలో రామ్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరంతా కాంగ్రెస్ మద్దతుతో ఎన్నికైన వారే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో



గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తామని కొత్తగా బాధ్యతలు చేపట్టబోయే సర్పంచ్‌లు తెలిపారు. జానకంపల్లిలో రూ.5లక్షలతో ఆంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణకు హామీ ఇచ్చారు. నాగిరెడ్డిపల్లిలో బీఆర్ఎస్‌కు ఉపసర్పంచ్ పదవీ ఇస్తే కాంగ్రెస్ మద్దతుదారుడు నర్సిములు సతీమణి పోటీలేకుండా వేలం నిర్వహించారు. సాలిండాపూర్, మదన్‌పల్లి, కట్టుకాల్వ, టేకులగడ్డ తండాల్లో సేవాలాల్, మరియమ్మ ఆలయాలకు రూ.5లక్షల చొప్పున ఇస్తామని ఒప్పందం చేసుకొని వేరేవారు సర్పంచ్‌గా పోటీ లేకుండా చూసుకున్నారు. అలాగే బురాన్‌పూర్‌లో సర్పంచ్ అభ్యర్థి ఎన్నికలో రూ.45.5లక్షలకు గ్రామస్తులు వేలం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి వేలం పాడి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని కొత్తగా నిర్మించేందుకు హామీ ఇచ్చారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థులు ఒప్పుకోకపోవడంతో సర్పంచ్ పదవి ఏకగ్రీవం కాలేదు.

పంతులూ.. నేను గెలుస్తానా?

జ్యోతిష్కులను ఆశ్రయిస్తున్న అభ్యర్థులు



కులకచర్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌కు పోటీచేసే అభ్యర్థులు జాతకాన్ని చూసుకుంటున్నారు. 'పంతులూ నా జాతకం చూసి చెప్పండి. ఎన్నికల్లో గెలుస్తానా? నా జాతకం ఎలా ఉంది?' అని పోటీ చేయాలనుకుంటున్న వారు జ్యోతిష్కులను ఆశ్రయిస్తున్నారు. సర్పంచ్ కావాలని కోరిక ఉంది. పోటీ చేసి గెలుస్తానా? ఏ రోజు నామినేషన్ వేయాలి? అని ఆరా తీస్తున్నారు. ఫలానా పంతులు జాతకం బాగా చెప్తాడు అంటే.. ఆయన వద్దకే వెళ్లి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పంతుళ్లు, జ్యోతిష్కుల సూచనల మేరకు ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఏదేమైనా పంచాయతీ ఎన్నికలు ఆశావహులను గుళ్లు గోపురాల బాట పట్టిస్తున్నాయి. జ్యోతిష్కులు, వేద బ్రాహ్మణులు, పంతుళ్లకు గిరాకీ పెరిగింది!

డబ్బు, మద్యం జాన్తానై..

మంచి వ్యక్తినే సర్పంచ్‌గా ఎన్నుకుందాం..

- విద్యావంతుడై గ్రామంలోనే ఉండాలి
- సమగ్రాభివృద్ధికి పాటుపడాలి
- నిజాయితీ, నిబద్ధత ఉంటేనే ఓటేయాలి
- విద్య, ఆరోగ్యం, వ్యవసాయంపై అవగాహన ఉండాలి
- న్యాయం వైపు నిలవాలి.. పల్లెలో శాంతి పరిరక్షించాలి
- ఇదీ సర్పంచ్ ఎన్నికపై ప్రజల అభిప్రాయం

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల పండుగ మొదలైంది. సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ వేసిన అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం చేస్తున్నారు. మూడు విడతల్లో మరో కొన్ని రోజుల్లో ప్రక్రియ ముగియనున్న ఎన్నికల జాతరలో ఓటర్లు ఎంజాయ్ చేయనున్నారు. పంచాయతీ ఎన్నికలకు విద్యార్హత ఏమీ లేకపోవడంతో పెద్దగా చదువుకోని వారు సైతం ప్రజాసేవకు సై అంటున్నారు. రిజర్వేషన్లతో అవకాశం కోల్పోయిన గ్రామపెద్దలు, సీనియర్ నాయకులు, కొందరు రియల్టర్లు గ్రామంలో తమ అధిపత్యం కోసం తమ అనుయాయులను రంగంలోకి దింపారు.



ఎన్నికల్లో డబ్బు, మద్యం వెదజల్లి గెలువాలన్న ఆలోచనలో కొందరున్నారు. అయితే ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేసి గ్రామాల్లో ప్రజలు పనులు చేయించుకోవాలని మేధావులు, సామాజిక వేత్తలు పిలుపునిస్తున్నారు. అందుకు సర్పంచ్‌గా ఎన్నికయ్యే వ్యక్తికి ఉండాల్సిన గుణగనాలను లెక్కిస్తున్నారు.

ఉండాల్సిన లక్షణాలివీ...

సర్పంచ్‌గా ఎన్నికయ్యే వ్యక్తి విద్యావంతుడై, గ్రామంలోనే ఉండాలి. పరిస్థితులపై సమగ్ర అవగాహన ఉండాలి. సమస్యలను పరిష్కరిస్తూ, గ్రామ అవసరాలను గుర్తించి ప్రణాళికలను రూపొందించాలి. అందరి మాటా వినాలి. గ్రామంలో పారిశుధ్యాన్ని పరిరక్షించాలి. పచ్చదనాన్ని పెంచాలి. ప్రజారోగ్యాన్ని పాటుపడాలి. పేదరిక నిర్మూలనకు, విద్యాభివృద్ధికి చేయూత ఇవ్వాలి. యువతకు ఉద్యోగ, ఉపాధికి బాటలు వేయాలి. ఏదైనా పని చేపట్టే ముందు ఇతర ప్రజాప్రతినిధులను, గ్రామ నాయకులను ఒప్పించాలి. ప్రజా పనులపై తరచూ అధికారులను కలుస్తుండాలి. గ్రామాభివృద్ధిని సాధించేవాడై ఉండాలి. ప్రజల్లో నెలకొనే తగవులపై పంచాయతీలో చర్చ పెట్టాలి. న్యాయంవైపు తీర్పు చెప్పే సమర్థత కలిగి ఉండాలి. గ్రామంలో నిరంతరం శాంతిభద్రతలను కాపాడేలా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ రంగంపై అవగాహనుండాలి. ఆధునిక సాగుబడి, గిట్టుబాటు ధరలపై రైతుల్లో చైతన్యం తేవాలి. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. వ్యవసాయానుబంధంగా పండ్ల తోటలు, కోళ్ల, పెంపకం, పాడి పరిశ్రమ, చేపల పెంపకం వంటి రోజువారీగా ఆదాయాన్ని తెచ్చే పనులకు ప్రోత్సాహన్ని అందించాలి. గ్రామంలో విద్యుత్తు, రవాణా, రోడ్ల సమస్యలు తలెత్తకుండా చూడాలి. ప్రతీ పనిలో పారదర్శకత చూపుతుండాలి.

ఆశయం ఉన్న అభ్యర్థికే ఓటు వేయాలి



పదవిపై ఆశతో కాకుండా గ్రామాభివృద్ధి ఆశయం ఉన్న అభ్యర్థికి ఓటు వేయాలి. గ్రామంపై అవగాహన ఉండి, అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సమయం ఇచ్చేవాడై ఉండాలి. అందరినీ సమన్వయపర్చి, సమర్థతతో సమస్యలను పరిష్కరించే వ్యకినే మనం గెలిపించుకోవాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు వేయాలి. విద్యకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలు అభివృద్ధి వైపు నడిచేలా చైతన్యం తెచ్చే నాయకుడిని ఎన్నుకోవాలి.

- వి.గంగిరెడ్డి, విద్యావేత్త, షాద్‌నగర్

ప్రలోభాలకు లొంగొద్దు



గెలిచిన నాటి నుంచి ఐదేళ్లు గ్రామాభివృద్ధికి పాటుపడే వ్యక్తినే సర్పంచ్‌గా ఎన్నుకోవాలి. ఎన్నికల సమయంలో ఐదు రోజుల ఆనందం కోసం ప్రలోభాలకు లొంగి ఓటును అమ్ముకోవద్దు. డబ్బు, మందు, బిర్యానీకి ఆశపడి గ్రామ భవిష్యత్తును పాడుచేయొద్దు. ఓట్ల కొనుగోలుకు పెట్టే ప్రతి రూపాయిని వడ్డీతో సహా గ్రామం నుంచే వెనకేసుకుంటారనే వాస్తవాన్ని ప్రజలు తెలుసుకోవాలి. నిజాయితీ, నిబద్ధతతో గ్రామాభివృద్ధికి కృషిచేసే వ్యక్తినే సర్పంచ్‌గా ఎన్నుకోవాలి.

- జి.శ్యాంసుందర్, మొగలిగిద్ద

వ్యవసాయంపై పట్టుండాలి



దేశానికి అన్నం పెడుతున్న వ్యవసాయ రంగంపై సర్పంచ్ అభ్యర్థికి పట్టు ఉండాలి. రసాయనిక వ్యవసాయాన్ని తగ్గిస్తూ సేంద్రియ సాగువైపు రైతులను ఉద్యుక్తుల్ని చేసేలా సమర్థుడై ఉండాలి. వ్యవసాయం దండగ కాదు.. పండుగ అనేలా రైతులకు సాగుబడి, గిట్టుబాటు ధరలపై అవగాహన కల్గించేలా కృషి చేయాలి.

- మందడి నరేందర్‌రెడ్డి, సామాజిక వేత్త, మధురాపురం

ప్రజా సేవకుడినే ఎన్నుకోవాలి



ఐదేళ్ల గ్రామ అభివృద్ధికి, ప్రజల మంచి చెడుల్లో తోడుండే సామాజిక దృక్పథం ఉన్న వ్యక్తినే ఎన్నుకోవాలి. సర్పంచ్‌గా సేవ చేసి, పేరు తెచ్చుకునే వాడై ఉండాలే తప్ప.. ఎన్నికల్లో పెట్టుబడిపెట్టి వ్యాపార ధోరణితో రాజకీయం చేసే వారిని ప్రజాప్రతినిధి పదవులకు దూరం పెట్టాలి. ఎన్నికలు పూర్తికాగానే అందర్నీ కలుపుకొని అభివృద్ధి చేస్తూ, శాంతిభద్రతలను కాపాడుతూ, నిజాయితీగా వ్యవహరిస్తాడనే వ్యక్తినే సర్పంచ్‌గా, వార్డు మెంబరుగా ఎన్నుకోవాలి.

- బి.సిద్దార్థ, మాజీ సర్పంచ్, గంట్లవెల్లి

వేడెక్కిన పల్లెపోరు

అభ్యర్థులను వెంటాడుతున్న ఎన్నికల ఖర్చుల భయం

బషీరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చలికాలంలో పల్లెలన్నీ పంచాయతీ ఎన్నికలతో వేడెక్కాయి. మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ముగియగా గ్రామాల్లో సందడి నెలకొంది. ఎలాగైనా సర్పంచ్‌గా గెలవాలని కొందరు అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడటం లేదు. నామినేషన్ల ముందు రోజు నుంచే ఓటర్లను ఆకట్టుకునేందుకు పావులు కదుపుతూ మద్యం పార్టీలిస్తున్నారు. అధికార పార్టీ మద్దతుదారులు మందు, విందు పంపకాలకు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నట్టు గ్రామస్తుల ద్వారా తెలుస్తోంది.

ఎంత ఖర్చయినా తగ్గేదే లే...

రూ.5లక్షల నుంచి రూ.30లక్షల వరకు వెచ్చించే యోచన

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ బరిలో ఉన్న వారు ఖర్చులకు వెనకడుగు వేయడం లేదు. చిన్న పంచాయతీల్లో కనీసం రూ.5లక్షలు, పెద్ద పంచాయతీల్లో రూ.25 నుంచి రూ.30లక్షల వరకు ఖర్చు చేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే తమ సొంత డబ్బులకుతోడు పార్టీ నాయకులు ఇచ్చే ఎన్నికల ఖర్చులపై సైతం కొందరు అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు.

ధారూరులో వార్డు రిజర్వేషన్‌పై గందరగోళం

- మొదట బీసీ.. తరువాత జనరల్ మహిళ అని పేర్కొన్న అధికారులు

ధారూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ధారూరు పంచాయతీలోని 11వ వార్డు రిజర్వేషన్‌పై సోమవారం గందరగోళం నెలకొంది. ఈ వార్డుకు నామినేషన్ వేసిన తర్వాత రిజర్వేషన్ మారిందని వేరే నామినేషన్ వేయాలని అధికారులు తెలపడంపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నామినేషన్ రెండో రోజు సోమవారం 11వ వార్డు నుంచి బీఆర్ఎస్ నుంచి మైతాబ్ నామినేషన్ వేశాడు. అధికారులు నామినేషన్‌ను స్వీకరించి మైతాబ్‌కు రశీదిచ్చారు. తర్వాత అధికారులు 11వ వార్డు రిజర్వేషన్ జనరల్(ఓసీ) మహిళ ఉందని, ఏ కులం వారైనా మహిళలే వేయాలని నామినేషన్ కేంద్రం నుంచి అధికారులు మైతాబ్‌కు ఫోన్ చేశారు. దీంతో మైతాబ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి నామినేషన్ సెంటర్‌కు వెళ్లి అధికారులను ప్రశ్నించాడు. తమకు ఇచ్చిన రిజర్వేషన్ల జాబితా ప్రకారమే నామినేషన్ వేశామని, నామినేషన్‌ను వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదని బీఆర్ఎస్ నాయకులు అధికారులకు తేల్చి చెప్పారు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా ఈ విషయమై ఎంపీడీవో నర్సింహులును వివరణ కోరగా.. ఒక్కసారి రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాత రిజర్వేషన్లను మార్చే వీలు లేదని, ఈ విషయంగా ఎక్కడ పొరపాటు జరిగిందో పరిశీలిస్తామని ఆయన చెప్పారు.

సర్పంచ్ నుంచి డీసీసీబీ చైర్మన్ వరకు..

- ప్రజలకు సేవలందించిన లక్ష్మారెడ్డి



తాండూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ మండలం రుద్రారానికి చెందిన లక్ష్మారెడ్డి సర్పంచ్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ వరకు ఎదిగారు. నాగులపల్లి, గోపాల్‌పూర్, రుద్రారం గ్రామాలు ఉమ్మడి పంచాయతీకి లక్ష్మారెడ్డి తండ్రి పెద్దబాల్‌రెడ్డి మొదటి సర్పంచ్‌గా పనిచేశారు. తర్వాత ఆయన రాజకీయ వారసత్వాన్ని స్వీకరించిన లక్ష్మారెడ్డి గోపాల్‌పూర్, రుద్రారం ఉమ్మడి పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తర్వాత రెండు గ్రామాలు విడిపోయి రుద్రారం స్వతంత్ర పంచాయతీ అయిన తర్వాత రెండోవసారి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. లక్ష్మారెడ్డి అంచెలంచెలుగా ఎదిగారు. తట్టేపల్లి పీఎసీఎస్ చైర్మన్‌గా, తాండూరు మున్సిపల్ చైర్మన్‌గా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా పని చేశారు.

సర్పంచి వేతనం రూ.6,500

బషీరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు ఆశావహులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సర్పంచికి ఇచ్చే గౌరవ వేతనంపైనా చర్చ నడుస్తోంది. ప్రసుత్తం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం రూ.6,500 వేలు ఉంది. గతంలో రూ.5వేలు ఉండగా, గత ప్రభుత్వం అదనంగా రూ.1,500 పెంచింది. అయితే ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఎలాంటి గౌవర వేతనం ఉండదు.

రేపటి నుంచి నామినేషన్లు

- తుది విడత పంచాయతీ పోరు
- తమ అభ్యర్థులెవరో తేల్చని ప్రధాన పార్టీలు

పరిగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుది విడత పంచాయితీ ఎన్నికలు జరిగే పరిగి నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. మొదటి విడత తాండూరు, కొడంగల్‌లలో నామినేషన్ ప్రక్రియ పూర్తిగా రెండో విడత ఎన్నికలు జరిగే వికారాబాద్‌లో నామినేషన్ల ప్రక్రియ మంగళవారం(నేటి)తో ముగుస్తుంది. మూడో విడత పరిగి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 157 పంచాయితీలకు రేపటి నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. పోలింగ్ ఈ నెల 17న నిర్వహిస్తారు. పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఎన్నికలుంటాయి. నామినేషన్ల ఘట్టం దగ్గర పడుతుండటంతో ఆయా పార్టీలు బలపర్చే అభ్యర్థులను ఖరారును చేయడం లేదు. కొన్ని చోట్ల నాయకులకు రిజర్వేషన్లు అనుకూలించలేదు. దీంతో వేరే అభ్యర్థుల ఎంపికకు ఇబ్బంది పడుతున్నారు. నామినేషన్లకు సమయం దగ్గర పడుతున్నార పార్టీ తరఫున ఎవరికీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడంతో సర్పంచ్ పదవులకు పోటీ చేసేవారిలో ఉత్కంఠ నెలకొంది. సర్పంచ్ స్థానాల్లో గెలిస్తే పార్టీ సింబల్ మీద నిర్వహించే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపు సులువు అవుతుందని పార్టీల నాయకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి పార్టీ అభ్యర్థికి మద్దతు ప్రకటించాలంటే పార్టీ మండల అధ్యక్షుడి నిర్ణయం కూడా కీలకం కానుంది. గ్రామ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరు సర్పంచ్‌గా పోటీ చేసే తమ అభ్యర్థికి మద్దతివ్వనున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచే సర్పంచ్ అభ్యర్థులు మద్దతు కోరుతున్నారు.

నామినేషనైతే వేద్దాం..

మొదట నామినేషనైతే వేసి అనంతరం పార్టీ నాయకుల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో తమ పార్టీ నాయకులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకున్నా నామినేషన్ల ఉపసంహరణ వరకు చూద్దామని ధోరణిలో సర్పంచ్ అభ్యర్థులు ఉన్నారు. గతంలో నామినేషన్లకు ముందుగానే పార్టీలు బలపరిచే అభ్యర్థులను తేల్చేవారు. ఈ సారి మాత్రం అలా జరగడం లేదు. రిజర్వేషన్లు మారడంతో ఏ గ్రామంలో పార్టీ నుంచి ఎవరిని నిలపాలనే సందిగ్ధంలో నాయకులు ఉన్నారు. అయితే పరిగి నియోజకవర్గంలో మాత్రంకాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నాయి. పట్టున్న చోట బీజేపీ కూడా ప్రయత్నాలు మొదలుపెట్టింది.

30ఏళ్లు సర్పంచ్‌గా 'చాట్ల' దంపతులు

- ఐదు సార్లు భర్త.. ఒక పర్యాయం భార్య సర్పంచ్‌గా సేవలు



చాట్ల బస్వరాజ్ దంపతులు

తాండూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఒకే పార్టీలో కొనసాగుతూ ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేసిన చాట్ల బస్వరాజ్ దంపతులకు యాలాల మండలం కమాల్‌పూర్ వాసులు 30ఏళ్ల సర్పంచ్‌గా అవకాశం కల్పించారు. చివరికి వారంతట వారే పోటీకి దూరంగా ఉన్నారు. ప్రజల హృదయాల్లో ఇప్పటికి నిలిచిపోయారు. యుక్త వయసులోనే కాంగ్రెస్‌లో చేరిన చాట్ల బస్వరాజ్ మొదటిసారి 1969లో నాగసమందర్, అన్నాసాగర్, కమల్‌పూర్ ఉమ్మడి పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. రెండోసారి కమల్‌పూర్, బానాపూర్, అడాల్‌పూర్ ఉమ్మడి పంచాయతీగా సర్పంచిగా పనిచేశారు. తర్వాత కమల్‌పూర్‌నకు మూడు సార్లు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కాగా రెండు సార్లు ఆయన ఏకగ్రీవ సర్పంచిగా పనిచేశారు. మొదటిసారి 1969 సర్పంచ్‌గా ఏకగ్రీవమైన సమయంలో ఆయన వయసు 18 సంవత్సరాలు. ప్రస్తుతం బస్వరాజ్ వయస్సు 76 సంవత్సరాలు. తర్వాత ఆయన సతీమణి మహదేవమ్మ సర్పంచ్‌గా పనిచేశారు. అనంతరం వారు రాజకీయాల్లో చురుగ్గా ఉన్నా సర్పంచిగా పోటీకి ఆసక్తి చూపలేదు.



చాట్ల బస్వరాజ్

కాంగ్రెస్ మద్దతు దారులను గెలిపించాలి

కడ్తాల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కడ్తాల పంచాయతీ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా రాయికంటి బిక్షపతి పేరును ప్రకటించారు. సర్పంచ్ అభ్యర్థిత్వానికి పార్టీ సీనియర్ నాయకుడు గురిగళ్ల లక్ష్మయ్య, బిక్షపతి పోటీపడ్డారు. దీంతో నాయకులు, కార్యకర్తలతో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు సమావేశమై అభిప్రాయ సేకరణ చేశారు. పరిషత్ ఎన్నికల్లో జడ్పీటీసీ, అవకాశం ఇస్తామని లక్ష్మ య్యకు హామీ ఇచ్చి బుజ్జగించారు. దీంతో రాయికంటి బిక్షపతి పేరును పార్టీ శ్రేణులంతా ప్రకటించారు. సోమవారం బిక్షపతిని ఎమ్మెల్యే నారాయణరెడ్డి సత్కరించారు. బిక్షపతిని భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో చందోజీ, జహంగీర్‌బాబా, జహంగీర్‌అలీ, శ్రీను, యాదగిరిరెడ్డి, మహేశ్, రాంచందర్, యాదయ్యగౌడ్, రవి, రాజేశ్, బుచ్చయ్య, మల్లేశ్‌గౌడ్, సత్యం, కృష్ణ, మల్లయ్య పాల్గొన్నారు.

బస్సు ఆపలేదని గొడవ ...

- పోలీసుస్టేషన్‌కు పంచాయితీ



పోలీసుస్టేషన్ ఆవరణలో గుమిగూడిన ప్రయాణికులు

ధారూరు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ మండలం మదనంతాపూర్ తండా నుంచి వికారాబాద్ వైపు వస్తున్న బస్సు రాంపూర్ తండా గేట్ వద్ద ఆపలేదు. దీంతో ధారూరు స్టేజీ వద్ద బస్సును ఆపి రాంపూర్ తండా మాజీ సర్పంచ్ పాండునాయక్ గొడవకు దిగారు. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. మదనంతాపూర్ నుంచి వస్తున్న బస్సులో ప్రయాణికులు నిండుగా ఉండటంతో డ్రైవర్ రాంపూర్ గేట్ వద్ద ఆపలేదు. దీంతో బస్సును వెంబడించిన మాజీ సర్పంచ్ ధారూరు బస్‌స్టేషన్ వద్ద బస్సును అడ్డగించి డ్రైవర్‌తో వాదనకు దిగారు. దీంతో బస్సులో ఉన్న మదనంతాపూర్ తండా మహిళలు పాండునాయక్‌పై కోపగించారు. 'మా బస్సును మీ తండా గేట్ వద్ద ఎందుకు ఆపుతారు? మా తండాలోనే బస్సు నిండిపోయింది. బస్సును ఎందుకు ఆపావ్?' అని ఆయనను నిలదీశారు. మా తండా అడవిలో ఉందని, బస్సు ఆపకపోతే ఎట్ల అని ఆయన ప్రశ్నించగా బస్సులో స్థలం లేనందునే ఆపలేదని డ్రైవర్, కండక్టర్ తెలపటంతో గొడవ పెరిగి పంచాయితీ పోలీసుస్టేషన్ వరకు చేరింది. బస్సును నిలిపిన పాండునాయక్‌పై మదనంతాపూర్ తండా వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు వారిని సముదాయించి బస్సును పంపించేశారు.

సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో గీతాపారాయణం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ఆధ్యాత్మిక గురువు త్రిదండి చిన జీయర్ స్వామి అధ్వర్యంలో సోమవారం గీతాపారాయణం నిర్వహించారు. విశ్వశాంతికి సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. ప్రతి హిందువూ భగవద్గీత పారాయణం చేయాలని ఈ సందర్భంగా చిన జీయర్‌స్వామి సూచించారు. ఉత్సవానికి వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులు, హైదరాబాద్ భక్తులు తరలొచ్చారు. భగవద్గీత పారాయణంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి మంగళాశాసనాలు అందజేశారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ్ జీయర్‌స్వామి, భక్తులు పాల్గొన్నారు.



సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో గీతాపారాయణం పఠిస్తున్న చిన జీయర్‌స్వామి

పల్లె పోరు.. నామినేషన్ల హోరు

- రెండోరోజు సర్పంచ్, వార్డు సభ్యులకు భారీగా నామినేషన్లు
- పలు చోట్ల ర్యాలీలు

ఆమనగల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థులు జోరుగా నామినేషన్లు వేస్తున్నారు. రెండో రోజు సోమవారం ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాల పరిధిలోని పలు పంచాయతీలలో ఆయా పదవులకు రిటర్నింగ్ అధికారులకు నామినేషన్లు సమర్పించారు. కొన్నిచోట్ల ప్రధాన పార్టీల మద్దతుదారులు నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. నామినేషన్ కేంద్రాలను జిల్లా సహాయ ఎన్నికల అధికారులు కుసుమ మాధురి, సుజాత, శ్రీకాంత్‌లు పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద సీఐలు జానకి రాంరెడ్డి, గంగాధర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు వెంకటేశ్, వరప్రసాద్, శ్రీకాంత్‌లు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పడకల్ సర్పంచ్ అభ్యర్థి డోకూరు సునిత ప్రభాకర్‌రెడ్డి, మేడిగడ్డ అభ్యర్థి రాజేశ్వరిమల్లేశ్ నాయక్, శంకర్‌కొండ అభ్యర్థి మండ్లీ రాములు, గాన్గుమర్ల తండా అభ్యర్థి లక్పతి నాయక్‌ల నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. నామినేషన్ల స్వీకరణలో ఎక్కడ కూడా పొరపాట్లకు తావివ్వొద్దని మండల స్పెషలాఫీసర్ శోభారాణి, జిల్లా సహాయ ఎన్నికల అధికారి కుసుమ మాధురిలు అన్నారు. ఆకుతోటపల్లి నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు.

కందుకూరు : మండలంలోని 35 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు మూడో విడత జరగనున్నాయి. ఈనెల 3 నుంచి 5వరకు నామినేషన్ వేయడానికి అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. 35 గ్రామ పంచాయతీలకుగాను 312 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. 51,706మంది ఓటర్లకు పురుషులు 25,865, మహిళలు 25,841మంది ఉన్నట్లు ఎంపీడీవో సరిత తెలిపారు.

కేశంపేట : మండలంలో 29 గ్రామ పంచాయతీలకు 142 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. దేవునిగుడితండా సర్పంచ్ అభ్యర్థిగా ఒకే ఒక్క నామినేషన్ వేశారు. ఇంకా మిగిలిన 28 గ్రామ పంచాయతీలకు 205 నామినేషన్లు వేయడా వాటిని పరిశీలించిన అధికారులు రెండు సెట్లు వేసినవారి నామినేషన్లలో ఒకదానికి తొలగించగా 142 మందితో తుది జాబితా సిద్ధమైనట్లు వివరించారు. మండలంలో 260 వార్డులకు 719మంది బరిలో నిలిచారని ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి తెలిపారు.


మొయినాబాద్ రూరల్ : బాకారం నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్


ఆమనగల్లు : సర్పంచ్ అభ్యర్థులు మండ్లీ రాములు, రాజేశ్వరిలతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


చేవెళ్ల : ఆలూరు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు వెళుతున్న కె.భాగ్యమ్మ శేఖర్‌గౌడ్

ఆదిభట్ల : ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పంచాయితీ ఎన్నికల కొరకు 5 నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 14 గ్రామపంచాయితీల ఉండగా.. 5 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడో దఫా ఎన్నికలు జరగనున్నాయి.

శంషాబాద్ రూరల్ : 21 జీపీలకు సంబంధించి 190 వార్డు సభ్యులకు ఇప్పటికే 155 మంది సర్పంచ్‌కు.. 719 మంది వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం పెద్దషాపూర్ తండా పంచాయతీకి నామినేషన్ వేసిన ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. పెద్దషాపూర్ తండా, కవ్వగూడ, పెద్దషాపూర్ గ్రామాల్లో మొత్తం 9 మంది వార్డు సభ్యులు నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎంపీడీవో మున్ని తెలిపారు. మరో రెండు రోజులు విడ్ డ్రా చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. పెద్దషాపూర్ తండాలో దాదాపు 9 మంది వార్డు సభ్యులు తమ నామినేషన్లను ఉప సంహరించుకోవడం విశేషం.

మొయినాబాద్ రూరల్ : సర్పంచ్ ఎన్నికల నామపత్రాల స్వీకరణ రెండో రోజు కొనసాగింది. మండలంలోని 19 గ్రామ సర్పంచ్ పదవులకు 166వార్డు పదవులకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అభ్యర్థులు హోరాహోరీగా నామినేషన్లు వేశారు. గ్రామాల నుంచి ర్యాలీగా తరలి నామినేషన్లు వేశారు. రెండో రోజు సర్పంచ్‌కు 32, 209 వార్డు పదవులకు నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో సంధ్యరాణి తెలిపారు. కనకమామి, చందానగర్, శ్రీరాంనగర్, బాకారం క్లస్టర్‌లలో నామినేషన్లు పూర్తికాగా చిన్నమంగళారం క్లస్టర్‌లో మాత్రం రాత్రి 8.30 గంటల వరకు కూడా నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాలేదు. కాగా, గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా జరగడానికి పోలీసు శాఖ పూర్తిస్థాయిలో పనిచేస్తుందని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేశ్ గౌతమ్ తెలిపారు. బాకారం జాగీర్ కేంద్రంను సందర్శించారు. ఎన్నికల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, నిబంధనలపై అధికారులకు సూచనలు చేశా రు. ఏసీపీ కిషన్, సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఎంపీడీవో సంధ్యరాణి బాకారం క్లస్టర్‌ను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు.

యాచారం : మండలంలో మూడో విడత ఎన్నికల నేపథ్యంలో క్లస్టర్లకు నామినేషన్ పత్రాలను పంపిణీ చేయానికి సోమవారం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సిద్ధం చేశారు. 24 జీపీలకు 10 క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రాధారాణి తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థులదే విజయం

యాచారం : సర్పంచ్ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థులదే విజయమని, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఓటర్లకు వివరిస్తూ విజయం సాధిస్తామని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందని అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నుంచి పోటీ చేసే 18 మంది సర్పంచ్ అభ్యర్థుల లిస్టును విడుదల చేశారు.


ఆమనగల్లు : రాంనుంతలలో సర్పంచ్ పదవికి నామినేషన్ వేస్తున్న ఆనంద్ నాయక్


తలకొండపల్లి : పడకల్ సర్పంచ్ పదవికి నామినేషన్ వేస్తున్న డోకూరు సునితప్రభాకర్ రెడ్డి


కడ్తాల్ : గాన్గుమర్ల తండాలో సర్పంచ్ పదవికి నామినేషన్ వేసేందుకు వెళ్తున్న లక్పతినాయక్


ఆమనగల్లు : శంకర్ కొండ సర్పంచ్ పదవికి నామినేషన్ వేస్తున్న మండ్లీ రాములు

క్రైం కార్నర్

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కొందుర్గు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొందుర్గు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముట్పూర్ గ్రామానికి చెందిన మేడిపల్లి పార్వతమ్మ(55) ఆమె భర్త చనిపోవడంతో అదే గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమెకు ఇద్దరు కూతుళ్లు ఉండగా రెండో కూతురు తన భర్తతో గొడవపడి విడాకులు తీసుకుంది. ఈ విషయమై పార్వతమ్మ కొద్దిరోజులుగా తీవ్ర మనస్తాపానికి గురైంది. భర్త చనిపోవడం, ఇంట్లో ఒంటరిగా ఉండటం, కూతురు విడాకులు తీసుకోవడం ఆమెను ఎంతో కలిచివేసింది. ఈ బాధను భరించలేకనే పార్వతమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు ఎస్సై తెలిపారు. అయితే, మృతదేహం బాగా కుళ్లిపోవడంతో మూడు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుందా అన్న కోణంలో విచారణ జరుపుతున్నామని చెప్పారు. పార్వతమ్మ కూతురు శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

లారీకింద పడిన యువకుడు మృతి

శంకర్‌పల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పక్కపక్కన వెళుతున్న రెండు బైకులు ఒకదానికొకటి తాకడంతో ఓ యువకుడు కిందపడగా.. వెనుక నుంచి వచ్చిన లారీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మోకిల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకకు చెందిన శుభం హెళ్తే(22) నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి నగరం నుంచి కొల్లూరుకు బైక్‌పై వెళుతుండగా.. ఇంద్రారెడ్డి నగర్ వద్ద గల సర్వీస్‌రోడ్డు వద్ద ప్రక్కనే వెళుతున్న మరో బైక్ అతడిని ఢీకొంది. దాంతో హెళ్తే కిందపడ్డాడు. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ అతడిపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మోకిల పోలీసులు తెలిపారు.


స్థానికులతో కలిసి కబ్జాకు గురైన ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్ దత్

అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం

- తహసీల్దార్ రవీందర్‌దత్
- ఇందిరమ్మ ఇళ్ల పట్టాలిస్తామని డబ్బులు వసూలు చేసిన కేటుగాళ్లు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ కాలనీలో ప్లాట్లు కబ్జాచేసిన అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరించారు. శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లిలో సర్వేనెంబర్ 163లో కొందరు ఇందిరమ్మ ఇళ్ల కోసం కేటాయించిన ప్లాట్లు కబ్జా చేశారని గత శనివారం తహసీల్దార్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ విచారణకు వచ్చారు. కొందరు ఏజెంట్లు ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసినట్లు తెలుసుకున్నారు. కాగా, ఎవరైతే కట్టడాలు ప్రారంభించారో ఎన్నికల తరువాత స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. పేద ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. గతంలో ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తొండుపల్లిలో 60గజాల చొప్పున 240ప్లాట్లు ఇచ్చింది. అందులో 24ప్లాట్లు మిగిలి ఉన్నాయి. ఇటీవల వాటిమీద కొందరి కన్ను పడింది. కొందరు అక్రమార్కులు ఏకంగా పిల్లర్ల గుంతలు తీశారు. గమనించిన స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, అక్కడ ఎవరు కూడా నిర్మాణాలు చేయడానికి వీల్లేదని, కబ్జాదారులు ఎవరైన సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో ఆర్ఐ కృష్ణ, స్థానికులు తదితరులు ఉన్నారు.

వైన్‌షాపులను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలి

ఆదిభట్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న వైన్‌షాపులతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయించాలని మాజీ కౌన్సిలర్లు ఆకుల సురేష్, రామవత్ శంకర్ నాయక్‌లు ఎక్సైజ్ అధికారులకు సోమవారం విన్నవించారు. నాగార్జున సాగర్ హైవేపై ఉన్న వైన్ షాప్‌లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాల పక్కన వైన్‌షాప్‌లు ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. సాగర్ రోడ్డుపై ఉన్న వైన్ షాపులతో శ్రీనగర్ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైన్‌షాప్‌లలో మందుబాబులకు పర్మిట్ రూమ్‌ల్లో మూత్రశాలలు లేకపోవడంతో రోడ్లపై మూత్ర విసర్జన చేస్తున్నారని.. వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మున్సిపల్, ఎక్సైజ్ అధికారులు చొరవ తీసుకొని మద్యం షాపులను జనావాసాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్లోబల్ సమ్మిట్ పనులు సమన్వయంతో పూర్తిచేయాలి

(ఐదో పేజీ తరువాయి)

అంతరాయం లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా రవాణా సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, హెలీప్యాడ్లు, పార్కింగ్ స్థలాల ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మెడికల్ సిబ్బందితో సమ్మిట్ ప్రాంగణంలో అవసరం ఉన్న చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. సుమారు 1300 మంది డెలిగేట్స్ వస్తున్న సందర్భంగా విమానాశ్రయం నుంచి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతం వరకు రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలోనూ చెత్తచెదారం లేకుండా చూడాలన్నారు. అక్కడక్కడ మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమ్మిట్ జరిగే ప్రాంతంలో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు నిర్వహించిన సమీక్ష అనంతరం క్షేత్రస్థాయిలో సమ్మిట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొటోకాల్ సెక్రటరీ వెంకటనర్సింహ్మారెడ్డి, అధికారులు ప్రేమ్‌రాజ్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా బోర్డు ఎండి కె.అశోక్‌రెడ్డి, జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ చంద్రారెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు ఆర్అండ్‌బీ, ఫైర్‌సేఫ్టీ, ట్రాన్స్‌పోర్టు, ఆర్టీసీ, టీజీఎస్పీడీసీఎల్, టూరిజం, ఆరోగ్య శాఖల అధికారులు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, కె.గోపాల్ పాల్గొన్నారు.


శశాంకతో కలిసి పనులను పరిశీలిస్తున్న చౌహాన్

రోడ్లకు ఇరువైపులా మొక్కలు..

గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ నేపథ్యంలో తుక్కుగూడ ఔటర్ రింగ్‌రోడ్డు మొదలుకొని మీర్ఖాన్‌పేట వరకు రోడ్డుకిరువైపులా అధికారులు మొక్కలు నాటుతున్నారు. సమ్మిట్ ప్రాంగణంలో సైతం వివిధ రకాల మొక్కలు నాటే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ముందుగా రోడ్డు డివైడర్‌లో ఎర్రమటిని తరలిస్తున్నారు.

గ్రీనరీ, పార్కుల ఏర్పాటు

గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో గ్రీనరీ, పార్కులను ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు సోమవారం రెడ్‌మెట్ గడ్డిని పార్కులా అందంగా మార్చుతున్నారు. సమ్మిట్‌కు వచ్చే ప్రతినిధులకు ఈ ప్రాంతం పచ్చదనం కనువిందు చేసేలా అధికారులు పనులు చేయిస్తున్నారు.

విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలి

కేశంపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతీ విద్యార్థి ఆంగ్లంపై పట్టు సాధించాలని మండల ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోషియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎడ్యూక్వెస్ట్ టాక్ ఛాంపియన్స్ పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో కొత్తపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థి జె. స్పందన, కేశంపేట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన అమీనా, జూనియర్ విభాగంలో కొత్తపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎస్. అక్షిత, పాపిరెడ్డిగూడ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి మాన్యశ్రీలు ప్రతిభ చాటారు. వారికి ఇన్‌చార్జి ఎంఈవో బహుమతులు అందజేశారు. ప్రతిభ కనబరిచిన వారు జిల్లాస్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈఎల్‌టీఏ మండల కన్వీనర్ వి.శ్రీనివాస్, ఆంగ్ల మాధ్యమ ఉపాధ్యాయులు జ్యోతి, రాజేశ్వరి, యాదగిరి తదిరులు పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న ఇన్‌చార్జిఎంఈవో చంద్రశేఖర్

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి


ఆమనగల్లు : విద్యార్థులతో ర్యాలీలో వైద్య సిబ్బంది, లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ మైమూన బేగం అన్నారు. ఎయిడ్స్ నిర్మూలనకు ప్రభుత్వాలు చేస్తున్న కృషిలో పాలు పంచుకోవాలని కోరారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం పురస్కరించుకొని ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీని మైమూనా బేగం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ, ఎంపీహెచ్ఈవో తిరుపతి రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : షాద్‌నగర్ పట్టణ శివారులోని గిరిజన బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూగర్భశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కల్పించి పలు పోటీలు నిర్వహించారు. పోస్టర్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలే మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు, బాధ్యతాయుతమైన ప్రవర్తన గూర్చి వివరించారు. ప్రస్తుత వైద్య చికిత్సల గూర్చి తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ కళాజ్యోతి, అధ్యాపకులు రాజేశ్వరి, ముంతాజ్, అఫ్రోజ్ తదితరులు ఉన్నారు.


షాద్‌నగర్ రూరల్ : అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బుంగమూతులు.. బుజ్జగింపులు!

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. మొదటి విడత ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గంతో పాటు, శంషాబాద్ మండల పరిధిలో గత నెల 27 నుంచి 29 వరకు సర్పంచ్, వార్డుమెంబర్ల నామినేషన్లను స్వీకరించారు. ఆదివారం నామినేషన్ల స్క్రూట్నీ అనంతరం షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని 153 గ్రామపంచాయతీలకు గాను 770 మంది సర్పంచ్‌లు బరిలో ఉన్నారు. గతంలో ఎన్నడూ ఊహించని విధంగా నామినేషన్లు దాఖలు కావడంతో ఆయా పార్టీల అగ్రనేతలు అయోమయంలో పడ్డారు. ఒక్కో గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి సగటున 98శాతం మంది అభ్యర్థులు బరిలో నిలవడం ప్రధాన పార్టీల మద్దతుతో నిలిచిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో ఉన్న నామమాత్రపు జనాభాకు ఇంతమంది అభ్యర్థులు పోటీ చేస్తే ఎవరికి గెలిచే అవకాశం ఉండదన్న భయం ప్రధాన పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో నెలకొంది.

రంగంలోకి దిగిన అగ్రనేతలు

పంచాయతీ పోరు అధికమవ్వడంతో ఆయా పార్టీల అగ్రనేతలు రంగంలోకి దిగారు. ఒకేపార్టీ నుంచి ఒకరికి మించి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులను పోటీ నుంచి తప్పుకోవాలని అభ్యర్థిస్తున్నారు. సొంత పార్టీ నుంచే ముగ్గురు నలుగురు పోటీచేస్తే ఓట్లు చీలిపోతాయని, అవతలి పార్టీ అభ్యర్థులకు లాభం చేకూరుతుందని సూచిస్తున్నారు. సొంత పార్టీ అభ్యర్థి గెలిస్తే గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించిన కాంట్రాక్టులు మీకే ఇస్తామంటూ నచ్చచెబుతున్నారు. దాంతో పాటు మీ మండలంలో కీలక పదవి కూడా ఇస్తామని, ఎలాగైన సొంత పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ప్రాధేయపడుతున్నారు. కొందరు అభ్యర్థులు తమకు ప్రజల మద్దతు ఉందని, గెలిచి తీరుతామంటూ మొండికేసిన వారికి ఎంతో కొంత ముట్టచెప్పేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో ఉండే ఓటర్లు సంఖ్య తక్కువ ఉన్నందున బరిలో నిలిచిన ఒక్కో అభ్యర్థికి కనీసం 10 ఓట్లు పోలైనా కూడా పార్టీకి నష్టం కలుగుతుందన్న ఉద్దేశంతో అగ్రనేతలు ఉన్నారు. ఎలాగైన వారిచేత నామినేషన్లను ఉపసంహరింప చేయడానికి పార్టీల అగ్రనాయకత్వం ఆచితూచి అడుగువేస్తుంది.

మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే

- మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు


కార్యక్రమంలో బక్కని నర్సింహులు తదితరులు


అన్నం వడ్డిస్తున్న ఖాజాపాషా

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మతాలు వేరైనా మనుషులందరూ ఒక్కటేనని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. షాద్‌నగర్ శివ మారుతీ గీతా అయ్యప్ప మందిరంలో సోమవారం అయ్యప్ప స్వాములకు జర్నలిస్టు ఖాజాపాషా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసే అవకాశం రావడం అదృష్టమని బక్కని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, న్యాయవాది కంచి రాజ్‌గోపాల్, శివమారుతి గీతా అయ్యప్ప మందిరం కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రెటికల్ పరమేశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ నామినేషన్ల జోరు

(ఐదో పేజీ తరువాయి)

కందుకూరు డివిజన్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో ఆయా గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులు ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు వేశారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది. జిల్లాలోని చేవెళ్ల, కందుకూరు డివిజన్‌లోని మొత్తం 178 సర్పంచ్ స్థానాలకు 407 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే 1540 వార్డులకుగాను 1,775 మంది అభ్యర్థుల నామినేషన్లు వచ్చాయి. కాగా తొలిరోజు అంతంత మాత్రంగానే నామినేషన్లు రాగా రెండో రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఆయా మండలాల్లో ఎన్నికల అధికారులు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఇరుముడి పూజ

ఆమనగల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రబిక్య తండా, సాకిబండ తండాలో సోమవారం ఆంజనేయస్వామి ఇరుముడి పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో హనుమాన్ మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. భక్తుల హనుమన్నామ స్మరణతో తండాలు మార్మోగాయి. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నాయకులు గణేశ్, కిషన్, నంగిరియా నాయక్, రమేశ్ నాయక్, గణేశ్, శివ, హనుమంతు, మోత్యనాయక్, శివ, వినోద్, రమేశ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ఐక్యత

షాబాద్ : ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ఐక్యత వెల్లివిరుస్తుందని, స్నేహభావం పెంపొందుతుందని రాష్ట్ర హాకీ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం షాబాద్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. షాబాద్ శివాలయం పునర్నిర్మాణానికి కృషి చేస్తామని, దాతలు భాగస్వాములు కావాలని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనుపంతులు, వెంకట్‌యాదవ్, రాజేందర్‌గౌడ్, లింగప్ప, శ్రీకరప్ప, మల్లిఖార్జున్, రాహుల్‌గుప్తా, శ్రీనివాస్, నర్సింహులుగుప్తా, శ్రీనివాస్‌గుప్తా, రజినీకాంత్, వెంకటయ్య, గౌరీశ్వర్, మల్లేష్, రాకేష్‌గుప్తా, శివకుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తలకొండపల్లి : రాంపూర్ శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆరురోజుల పాటు కొనసాగే ఉత్సవాలకు నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. తొలిరోజు ఆలయంలో అంకురార్పణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జిల్లెల్ల పవన్‌కుమార్ రెడ్డి, ఈవో స్నేహలత, ఆలయ కమిటీ సభ్యులు కాకి లక్ష్మయ్య, స్వామి గౌడ్, వెంకటయ్య, యాదయ్య, జంగయ్య, మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.


ఆమనగల్లు : ర్యాలీగా తరలిన భక్తులు

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అకడమిక్ ఆడిట్

ఆదిభట్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరం అకడమిక్ ఆడిట్ హయత్‌నగర్ ప్రిన్సిపాల్ సురేశ్ బాబు, విద్యాశాఖ అకడమిక్ అధికారి ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీలో విద్యార్థుల హాజరు పట్టిక, ప్రాక్టికల్ పరీక్షలు, తరగతి గదుల నిర్వహణ వంటి కార్యక్రమాలు తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ సురేశ్ బాబు మాట్లాడుతూ కాలేజీలో నిర్వహించిన అన్ని రికార్డులు న్యాక్ గ్రేడ్‌కు ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాధిక, వైస్ ప్రిన్సిపల్ సురేష్, అధ్యాపకులు కృష్ణ, సురేష్, నరేందర్‌రెడ్డి, రవికుమార్, రమేష్, డీవీ రావు, రాకేష్, భవాని విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్